

ఫుట్‌బాల్ విజేత అనంత

ఏపీ అంతర్ జిల్లాల అండర్–14 ఫుట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం విజేతగా నిలిచింది.

8లో



కిలో టమాట రూ.25

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.11, సరాసరిన రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/ 20.2°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

క్లెయిమ్‌లు పక్కాగా పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ– 2024 కార్యక్రమంలో అందిన క్లెయిమ్‌లను పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. అనంతపురం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న క్లెయిమ్‌లు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను కలెక్టర్ గురువారం పరిశీలించారు. అధికారులకు సూచనలిచ్చారు. ఫారం–7 దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ఫైలింగ్, డాక్యుమెంటేషన్ సరిగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ వేంకటేశ్వర్లు, డీపీఓ ప్రభాకర్‌రావు, డీఎల్‌డీఓ ఓబులమ్మ, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీఓ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



పోటీలను ప్రారంభిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం రూరల్: ఆత్మస్థైర్యంతో ముందుకెళితే ఏదైనా సాధించవచ్చని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. గురువారం నీలం సంజీవ రెడ్డి స్టేడియంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను జేసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు మానసిక స్థైర్యాన్ని అలవర్చుకోవాలన్నారు. పట్టుదలతో కృషి చేస్తే సామాన్యులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. విభిన్న ప్రతిభావంతులను అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారికి డిసెంబర్ 3న (విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం) బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



కంది పంటను పరిశీలిస్తున్న డీఏఓ

ఉరవకొండ/విడపనకల్లు: పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారిణి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఉరవకొండ మండల పరిధిలోని చిన్నముష్టూరు, కోనాపురం, బూదగవి, విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి సమీపంలో రైతుల పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉరవకొండ మండలాన్ని ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందన్నారు. కంది, ఆముదం పంట రైతుల పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఏడీఏ పద్మజ, మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ పాల్గొన్నారు.

ఇండియా–ఏ జట్టుకు అనూష



అనంతపురం: ఇండియా–ఏ ఉమెన్ క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన బి. అనూష ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల ఆసియా కప్‌లో ఇండియా ప్రధాన జట్టుకు ఆమె ఆడారు. ఈ క్రమంలోనే ఇండియా–ఏ తరఫున ఇంగ్లాండ్ ఉమెన్ టీంతో జరిగే టోర్నీకి ఎంపికయ్యారు. ముంబైలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 3 వరకు టీ–20 సిరీస్ నిర్వహించనున్నారు. నార్పల మండలం బండ్లపల్లికి చెందిన అనూష ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి విగ్రహం

ప్రేమతత్వం.. సేవా మార్గం!

- పండుగలా సత్యసాయి జయంతి వేడుకలు
- దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు
- మార్మోగిన సాయి నామస్మరణ
- సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం చేస్తామన్న ట్రస్టు సభ్యులు



సత్యసాయి జయంతి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయిన సాయికుల్వంత్ హాల్

ప్రశాంతి నిలయం: పండుగ వాతావరణంలో సత్యసాయి జయంత్యుత్సవాలు జరుగుతున్నాయి. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో గురువారం సత్యసాయి 98వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహా సమాధి చెంత విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువందనం పేరుతో విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ చక్కని భక్తిగీతాలు ఆలపించారు.

డిజిటల్ స్క్రీన్‌లపై సాయి సందేశం..

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండే సత్యసాయి జయంతి వేడుకలు, సత్యసాయి సేవలను వివరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ట్రస్ట్ వార్షిక నివేదిక (2022–23)ను ప్రతిని సత్యసాయి మహా సమాధి చెంత ఉంచి అనంతరం విడుదల చేశారు. ఆ తర్వాత భక్తులకు తెచ్చిన కేక్‌లను సత్యసాయి మహా సమాధి చెంత ఉంచి కట్ చేశారు. సత్యసాయి పూర్వపు సందేశాలను డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శించారు.

పారదర్శకంగా సేవలు..

సత్యసాయి బోధనలను మనసా వాచా కర్మేన ఆచరిస్తూ ఆయన చూపిన మార్గంలో నడవడమే సత్యసాయికి నిజమైన నివాళి అని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద అన్నారు. సత్యసాయి నిర్దేశించిన లక్ష్యాలు, ఆశయాలకు అనుగుణంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మానవాళికి పారదర్శకంగా సేవలు అందిస్తోందన్నారు. కోవిడ్ తరువాత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పలు సామాజిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు.

31 లక్షల మందికి ఓపీ సేవలు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని 44,392 పాఠశాలల్లో 38 లక్షల మంది విద్యార్థులకు రాగి జావ అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని నాగానంద తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. పేదలకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో సత్యసాయి ప్రారంభించిన విద్యావాహిణి ద్వారా 1000 మంది వలంటీర్లు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి రూ.186 కోట్ల రెవెన్యూ ఆదాయం, కార్పస్ ఫండ్ ద్వారా రూ.35 కోట్లు ట్రస్ట్‌కు ఆదాయంగా వచ్చిందన్నారు. రూ.30 కోట్లు మూలధన వ్యయం, రూ.160 కోట్ల రెవెన్యూ వ్యయం చేయడం జరిగిందన్నారు. రెండు సూపర్ స్పెషాలిటీ, రెండు జనరల్ ఆస్పత్రులకు, మొబైల్ ఆస్పత్రి నిర్వహణకు అధిక మొత్తంలో వ్యయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సత్యసాయి విద్యాసంస్థల నిర్వహణకు రూ.41 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. పేద ప్రజల సేవా కార్యక్రమాల నిమిత్తం రూ.4 కోట్లు ఖర్చు చేశామన్నారు. వార్షిక బడ్జెట్‌లో రూ.161 కోట్లు రెవెన్యూ వ్యయం చేశామన్నారు. సత్యసాయి వైద్యశాలల ద్వారా 31 లక్షల మందికి ఓపీ సేవలు, మొబైల్ ఆస్పత్రి ద్వారా 50 వేల మందికి రోగులను సేవలు అందించామన్నారు. వార్షిక ఏడాదిలో 4,500 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించామన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్లు పి.అరుణ్‌బాబు, గౌతమి, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఆర్‌జే.రత్నాకర్‌రాజు, హీరా, చక్రవర్తి, నాగానంద, డాక్టర్ మోహన్, మనోహర్ శెట్టి, ఆంధ్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, తెలంగాణ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు విశ్వవ్యాప్తం చేస్తాం..

సత్యసాయి మానవాళికి బోధించిన లవ్ ఆల్.. సర్వ్ ఆల్, హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్ అన్న సూక్తిని ప్రతి సాయిభక్తుడు పాటిస్తూ సత్యసాయికి నిజమైన నివాళులర్పించాలని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండే సూచించారు. సత్యసాయి దేశీయ సేవా సంస్థల ద్వారా మెడికల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశీయంగా పోలీస్, భారతీయ ఆర్మీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలు సత్యసాయి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణను ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. దేశీయంగా వివిధ ప్రాంతాలలో 300 నైపుణ్యాభివృద్ధి శిక్షణ సెంటర్లను నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ సత్యసాయి సేవా బృందాల ఏర్పాటుకు గ్లోబల్ కౌన్సిల్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2024 జూలైలో ప్రశాంతి నిలయం వేదికగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్ష మంది యువతతో ప్రపంచ సదస్సు నిర్వహిస్తామన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల కోసం వేలాది మంది వలంటీర్లు ప్రత్యేక చొరవతో పని చేస్తున్నారన్నారు. ఉరవకొండలో సత్యసాయి మందిరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఏపీ, తెలంగాణ సత్యసాయి సేవా సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు.

వైభవంగా స్వర్ణ రథోత్సవం

ప్రశాంతి నిలయం పురవీధులలో సత్యసాయి స్వర్ణ రథోత్సవ ఘట్టం వైభవంగా జరిగింది. గురువారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రశాంతి నిలయం పురవీధుల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సత్యసాయి భక్తులు 'ఓం శ్రీ సాయిరాం' అంటూ స్వర్ణరథాన్ని లాగారు. సత్యసాయిని కీర్తిస్తూ స్వర్ణరథోత్సవం ప్రశాంతి నిలయం పురవీధులలో సాగింది.

అలరించిన సంగీత కచేరి ..

సత్యసాయి 98వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ సంగీత విద్వాంసురాలు కౌశిక్ చక్రవర్తి బృందం సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి స్వరాలతో నిర్వహించిన సంగీత విభావరి భక్తులను తన్మయత్వానికి గురిచేసింది.

సత్యసాయి జోలోత్సవం...

ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయికి జోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి జోలోత్సవ ఘట్టాన్ని నిర్వహించారు.

పేదింట పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం: పేద తల్లిదండ్రులకు ఆడబిడ్డల పెళ్లిళ్ల భారం కాకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ 'వైఎస్సార్ కళ్యాణమస్తు', 'వైఎస్సార్ షాదీ తోఫా' పథకాలతో సాయమందిస్తున్నారని కలెక్టర్ గౌతమి తెలిపారు. ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లోకి ఆర్థిక సాయాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జమ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, నగరపాలక సంస్థ మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం. మంజుల, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాగజ్ ఘర్ రిజ్వాన్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన 469 మందికి రూ.3.86 కోట్ల లబ్ధి కలిగిందన్నారు. ఎస్సీ కేటగిరీలో 147 మందికి రూ.1,47,60,000, ఎస్టీ– 32 మంది– రూ.32.60 లక్షలు, బీసీ– 223 మంది– రూ.1.13 కోట్లు, మైనార్టీలు 82 మంది– రూ.83.80 లక్షలు, దివ్యాంగులకు సంబంధించి రూ.9 లక్షలు జమైందన్నారు. సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ చేయూతతో ఆడపిల్లల చదువులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్ రావు, డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహా రెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీ తదితరులున్నారు.

ప్రజలను మోసగిస్తే ఉపేక్షించం

- 08554–241249కు సమాచారమిచ్చినా చర్యలు
- 'విజిలెన్స్' ఎస్పీ మునిరామయ్య



అనంతపురం క్రైం: ప్రజలను మోసగిస్తే ఉపేక్షించమని ఎస్పీ మునిరామయ్య స్పష్టం చేశారు. గురువారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్రమార్కులపై కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 'టాస్క్‌ఫోర్స్' బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. అక్రమార్కులు, కల్తీగాళ్లపై ఫిర్యాదు చేసేందుకు 08554–241249 నంబరును 24 గంటలూ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అపరిశుభ్ర వాతావరణంలో హోటళ్లు, సినిమా హాళ్లు ఉన్నా, ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టిస్తున్నా, వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తున్నా ఫిర్యాదు చేయాలని సూచించారు. పన్ను ఎగవేతదారులపై సమాచారమివ్వాలని కోరారు. కొన్ని చోట్ల హాస్టళ్లలో విద్యార్థులకు ఆహారాన్ని సరిగా ఇవ్వడం లేదన్న విషయం గుర్తించామని, సదరు అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సులు పంపామన్నారు. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పట్టిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం కిలో బియ్యాన్ని రూ.47తో కొనుగోలు చేసి నిరుపేదలకు ఉచితంగా అందిస్తోందన్నారు. ఆ బియ్యాన్ని అక్రమార్కులు రూ.10–12కు కొనుగోలు చేసి, అనంతరం పాలిష్ చేసి రూ.60తో విక్రయించి సొమ్ము చేసుకుంటుండడంతో ప్రభుత్వానికి రూ. కోట్ల మేర నష్టం వాటిల్లుతోందన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో చాలా పోషకాలున్నాయన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని, బియ్యాన్ని విక్రయించరాదన్నారు. ఇప్పటివరకూ ఎగవేసిన వివిధ రకాల పన్నులు రూ.88.05 కోట్లు వసూలు చేశామన్నారు. వాహన తనిఖీల్లో రూ.3.38 కోట్ల మేర జరిమానా విధించామన్నారు. ఇప్పటివరకూ 39 చౌక దుకాణాలు, 11 మండల స్టాక్ పాయింట్లు, 140 మిల్లులు, వ్యాపార సంస్థలు, 3– అంగన్‌వాడీ సెంటర్లు, వసతి గృహాలు, 21– ఎరువుల దుకాణాలు, 3– సినిమా థియేటర్లు తనిఖీ చేశామన్నారు. నిత్యావసర వస్తువుల చట్టం 6 (ఏ)/7(1) కింద 314 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రూ.44.66 లక్షల విలువ చేసే 62.524 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్ చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 7 దుకాణాల్లో రూ.91,575 విలువ చేసే ఉత్పత్తులు సీజ్ చేసినట్లు వెల్లడించారు.

బంగారు దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం క్రైం: నగరంలోని పలు బంగారు నగల విక్రయ దుకాణాలను విజిలెన్స్ అధికారులు గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇలాహి, సయ్యద్, తాడిపత్రి జ్యువెలర్స్‌లో ఎలక్ట్రానింగ్ వేయింగ్ మిషన్‌తో పాటు రికార్డులూ పరిశీలించారు. రికార్డుల్లోని వ్యత్యాసాలు గుర్తించి ఆయా దుకాణాల యజమానులపై లీగల్ మెట్రాలజీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రామారావు, డీసీటీఓ విజయలక్ష్మి, తూనికలు కొలతల శాఖ అధికారులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- లుచ్చా పనులు చేసే నువ్వా నా గురించి మాట్లాడేది?
- జేసీ ప్రభాకర్ రెడ్డికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు

తాడిపత్రి: బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని జేసీ ప్రభాకర్ రెడ్డిని ఎమ్మెల్యే పెద్దారెడ్డి హితవు పలికారు. పట్టణంలో అభివృద్ధి పనుల్లో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టర్లు, కార్మికులను బెదిరించడం, కమీషన్లు ఇవ్వాలంటూ వేధిస్తుండడాన్ని నిరసిస్తూ గురువారం ఆయన జేసీ ప్రభాకర్ ఇంటి ముట్టడికి బయలుదేరారు. స్థానిక అశోక్ పిల్లర్ సర్కిల్ వద్ద డీఎస్పీ గంగయ్య నేతృత్వంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడారు. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో పనులు చేస్తున్న ఎలక్ట్రీషియన్‌ను రెండు రోజుల క్రితం జేసీ ప్రభాకర్‌రెడ్డి వాట్సాప్ కాల్‌లో పనులు చేపట్టరాదంటూ బెదిరించాడన్నారు. మిగతా కార్మికులను కూడా పనులు చేపట్టరాదని, లేదంటే కమీషన్లు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. మున్సిపాలిటీలో సొంత ఖర్చుతో అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులు చేయిస్తుంటే అడ్డుకుంటున్నాడని విమర్శించారు. నిత్యం మట్కా, గ్యాంబ్లింగ్, వ్యభిచారాన్ని నడిపే ఓ నలుగురిని దగ్గర పెట్టుకుని అసత్యాలు మాట్లాడిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడన్నారు. కొందరు టీడీపీ కౌన్సిలర్లు యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. లుచ్చా పనులు చేసుకుంటూ ఇప్పటికీ చికెన్ సెంటర్లలో కేజీకి పది రూపాయల కమీషన్ దండుకుని బతుకుతున్నాడని ధ్వజమెత్తారు. తన స్థాయికి రావాలంటే జేసీ ప్రభాకర్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి దిగిరావాలన్నారు. ఒక మహిళను అడ్డుగా పెట్టుకుని అధికార పక్ష నాయకులు, సీఎంను తిట్టిస్తున్నాడన్నారు. పదుల సంఖ్యలో కేసుల్లో నిందితురాలిగా ఉన్న ఆమెను పావుగా వాడుకుంటున్నాడన్నారు. తాడిపత్రి నియోజకవర్గ బరిలో జేసీ ప్రభాకర్ రెడ్డా లేక అతడి కొడుకా లేక సోదరుడు దివాకర్‌రెడ్డా లేక కుమారుడా ప్రజలకు తెలపాలన్నారు. ''మున్సిపల్ కమిషనర్‌ని ఎవరికి పుట్టావురా అంటూ బెదిరించిన నువ్వు.. ముందు నువ్వు ఎవడికి పుట్టావో తెలపాలి. తాడిపత్రిలో మరో మారు ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే. ఏప్రిల్ తర్వాత స్టువర్టుపురం పోతావో లేక గద్వాల్‌కు పోతావో ఇప్పుడే డిసైడ్ చేసుకో'' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

అనంతపురం సెంట్రల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు.

బస్సులు, చార్జీల వివరాలు..

ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు అనంతపురం నుంచి గుత్తి, కర్నూలు మీదుగా శ్రీశైలం వెళ్తుంది. తిరిగి సోమవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు అనంతపురం చేరుకుంటుంది. చార్జీ పెద్దలకు రూ. 532, పిల్లలకు రూ. 266.

- నవంబర్ 26 ఉదయం 6 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు అనంతపురం నుంచి కదిరి, మదనపల్లి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలానికి ఏర్పాటు చేశారు. తిరిగి 27న సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు అనంతపురం చేరుకుంటుంది. చార్జీ పెద్దలకు రూ. 1,450, పిల్లలకు రూ. 725.
- నవంబర్ 26న గుంతకల్లు డిపో నుంచి అనంతపురం, కదిరి, మదనపల్లి, చిత్తూరు మీదుగా అరుణాచలానికి ప్రత్యేక బస్సు. చార్జీ రూ. 1,900
- కళ్యాణదుర్గం డిపో నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు వయా అనంతపురం, కర్నూలు, ఆత్మకూరు, దోర్నాల మీదుగా శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్. చార్జీ రూ. 574.
- రాయదుర్గం డిపో నుంచి రోజూ సాయంత్రం 3 గంటలకు శ్రీశైలం (వయా బళ్లారి, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు, దోర్నాల) ఎక్స్‌ప్రెస్ బస్సు. చార్జీ రూ. 620. అలాగే, ప్రతి ఆదివారం అరుణాచలం (వయా కళ్యాణదుర్గం, అనంతపురం, మదనపల్లి, చిత్తూరు, కాణిపాకం మీదుగా) సూపర్ లగ్జరీ బస్సు ఉంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, బంగారు తిరుపతి వెళ్తుంది. చార్జీ రూ. 1,950.
- ఉరవకొండ నుంచి అరుణాచలానికి 26న సాయంత్రం 6 గంటలకు బస్సు. చార్జీ రూ. 1,570
- తాడిపత్రి నుంచి రోజూ శ్రీశైలానికి ఉదయం 7.30 గంటలకు బస్సు. మరుసటి ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రం 6కు తాడిపత్రికి. పెద్దలకు రూ. 460, పిల్లలకు రూ. 245 చార్జీ. అలాగే త్రిలింగ దర్శనం కోసం ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు బస్సు. బనగానపల్లె, యాగంటి, నందవరం, నంద్యాల, మహానంది, ఓంకారం వెళ్లి తిరిగి నంద్యాల, బనగానపల్లి మీదుగా తాడిపత్రి వస్తుంది. పెద్దలకు రూ. 470, పిల్లలకు రూ. 250 చార్జీ ఉంటుంది.

క్లుప్తంగా

'ఎస్ఆర్ఐటీ'కి 15 అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఎస్ఆర్ఐటీ సిబ్బంది

బుక్కరాయసముద్రం: వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటీ)కు జాతీయ స్థాయిలో మొత్తం 15 అవార్డులు దక్కాయి. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ గురువారం వెల్లడించారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ గోవాలో ఎడ్యూ స్కిల్స్ కనెక్ట్ కాంక్లేవ్-2023 జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఆర్ఐటీ విద్యార్థులు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 15 నేషనల్ లెవల్ బెస్ట్ ఫర్మార్మెన్స్ అవార్డులు అందుకున్నారు. ఈ క్రమంలో ఆ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ మంది ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినందుకు ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు కూడా దక్కింది. అలాగే ఉత్తమ ఇన్‌స్ట్రక్టర్‌గా ఏడబ్ల్యూఎస్‌లో డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్‌కు, సెలోనిస్‌లో వీర ప్రకాష్‌కు, బ్లూ ప్రిజంలో సుమన్‌కు, ఫాలో అల్టోలో డాక్టర్ చిత్ర లింగప్ప అవార్డులు అందుకున్నారన్నారు. బెస్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్‌గా ప్రణీల్ కుమార్ ఎంపికయ్యారు. యాక్టివ్ ఇన్సిస్టిట్యూట్ సపోర్టర్‌గా డాక్టర్ రంజిత్‌రెడ్డికి అవార్డు దక్కింది. అవార్డులు దక్కించుకున్న విద్యార్థులు, ప్రొఫెసర్లను కళాశాల యాజమాన్యం, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ విజేత 'అనంత'


విజేత ట్రోఫీ అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు

తగరపువలస: ఎస్‌జీఎఫ్ 67వ ఏపీ అంతర్ జిల్లాల అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో వైఎస్సార్ జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్స్‌గా కర్నూలు, మూడో స్థానంలో వైఎస్సార్ జిల్లా, బాలుర విభాగంలో రన్నర్స్‌గా అనంతపురం, మూడో స్థానంలో విశాఖ జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలను భీమిలి జెడ్పీ బి.రాము అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. మూడు రోజుల పాటు బాలురకు భీమిలి వుడా మినీ స్టేడియంలో, బాలికలకు సంగివలస వరల్డ్ అమేయా స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి.

కంటి దీపాలు.. జీవచ్ఛవాలు!

- నరాల బలహీనతతో ఎదుగుబొదుగు లేని పిల్లలు
- ఆడుతూ పాడుతూ ఉండాల్సిన వయసులో మంచానికే పరిమితం
- 11 ఏళ్లుగా పిల్లలను చూస్తూ తల్లిదండ్రుల క్షోభ
- కేరళలో వైద్యంతో కోలుకుంటున్న చిన్నారి
- చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థిక ఇబ్బందులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



నరాల బలహీనతతో ఉన్న చిన్నారులు, ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు రామకృష్ణ, శ్రీలక్ష్మి

ధర్మవరం అర్బన్: ఆడుతూపాడుతూ తిరుగాడే వయసులో మంచానికే పరిమితమైన చిన్నారులు. ఆస్తులన్నీ అమ్మేసినా నయం కాని జబ్బు. నరాల బలహీనతతో ఎదుగు బొదుగు లేకుండా జీవచ్ఛవాల్లా మంచానికే పరిమితమైన కన్నబిడ్డలను చూస్తూ ఆ తల్లిదండ్రులు కన్నీరు పెట్టని రోజంటూ లేదు. చిన్నారులను మాములు మనుషులుగా చేసుకునేందుకు వారు పడుతున్న తపన మాటల్లో వర్ణించలేనిది. ఇది ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడి దీనగాథ.

పుట్టుకతోనే లోపం

నార్పలకు చెందిన చింతా రామకృష్ణ, శ్రీలక్ష్మి దంపతులు చేనేత కార్మికులు. వీరికి పదకొండేళ్ల వయసున్న కుమారుడు దీపక్, తొమ్మిదేళ్ల వయసున్న కుమార్తె సునంద ఉన్నారు. పుట్టుకతోనే నరాల బలహీనత చిన్నారులను వేధిస్తూ వచ్చింది. ఎదుగు బొదుగు లేని పసికందులను తీసుకుని చెన్నై, తిరుపతి, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాల్లో తల్లిదండ్రులు వైద్యం చేయించారు. అయినా నయం కాలేదు. చూస్తుండగానే 11 ఏళ్లు గడిచిపోయాయి. కళ్లముందు తోటి పిల్లలు ఆడుకుంటూ స్కూల్‌కు వెళుతుంటే తమ పిల్లలు మాత్రం జీవచ్ఛవాల్లా మంచానికే పరిమితం కావడంతో ఆ తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది.

పిల్లల కోసం ఆస్తులమ్మేసి....

పిల్లలను మాములు మనుషులుగా చేసుకునే క్రమంలో నార్పలలో ఉన్న తన సొంతింటిని రూ.4.20లక్షలకు రామకృష్ణ అమ్మేశాడు. అనంతరం బతుకు తెరువు కోసం కుటుంబాన్ని ధర్మవరానికి మార్చాడు. శాంతినగర్‌లో నివాసముంటూ మగ్గం నేత పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరోగ్య శ్రీ పరిధిలో లేకపోవడంతో చికిత్స లేకపోవడంతో చేతిలో ఉన్న డబ్బు మొత్తం తుడిచి పెట్టుకుపోయింది. పిల్లల బాగోలు, వారికి అవసరమైన మందులు, పౌష్టికాహారం కోసం ప్రతి నెలా రూ.10వేలు ఖర్చవుతోంది. ఈ క్రమంలో కేరళ ఆయుర్వేద వైద్యంతో ఫలితముంటుందన్న ఆశతో ధర్మవరంలో ప్రస్తుతం ఉంటున్న ఇంటిని రూ.5.50 లక్షలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారి వద్ద తాకట్టు పెట్టి చికిత్స చేయించారు. దీంతో పాపలో మార్పులు మొదలయ్యాయి. విషయాన్ని గుర్తించిన నిరుపేద చేనేత కార్మిక దంపతుల మదిలో ఆశలు చిగురించాయి. పిల్లలను కేరళకు తీసుకెళ్లి వైద్యం చేయించాలని అనుకుంటున్నారు. అయితే అక్కడికెళ్లి చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సాయం చేస్తే పిల్లలను మాములు మనుషులుగా చేసుకుంటామని వేడుకుంటున్నారు.

సాయం చేయదలిస్తే..

పేరు : రామకృష్ణ చింతా
బ్యాంక్ : ఐడీబీఐ, ధర్మవరం శాఖ
ఖాతా నంబర్ :
1795 1040 0004 7694
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : IBKL0001795
ఫోన్ పే : 91609 16746

నేటితో ముగియనున్న ఎస్కేయూ వీసీ పదవీకాలం


డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ) ఆచార్య డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పదవీకాలం శుక్రవారంతో ముగియనుంది. 2021, నవంబర్ 25న ఎస్కేయూ వీసీగా ఆయన నియమితులయ్యారు. నిబంధన మేరకు మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగిన ఆయన ఈ నెల 24తో వైదొలగనున్నారు. ఈ నేపథ్యంలో నూతన వీసీ నియామకం అనివార్యమైంది. దీంతో ఇప్పటికే నూతన వీసీ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీ (అన్వేషణ కమిటీ) నియామకం పూర్తయింది. వర్సిటీ పాలకమండలి నుంచి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరొకరు, యూజీసీ తరఫున ఇంకొకరు నామినీలుగా త్రిసభ్య సెర్చ్ కమిటీ ఇప్పటికే మూడు పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించింది. వీరిలో ఒకరిని వీసీగా రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ నియామకం చేస్తారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి వీసీని ప్రకటించే వరకూ ఇన్‌చార్జి వీసీని నియామకం చేయనున్నారు.

వర్సిటీపై మాచిరెడ్డి మార్క్

ఎస్కేయూ అభివృద్ధిలో వీసీగా ఆచార్య డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తనదైన ముద్రను వేశారు. మూడేళ్ల కాల వ్యవధిలో వర్సిటీ గణనీయమైన పురోగతి సాధించింది. ఇండోర్ స్టేడియం, ఉద్యోగుల క్వార్టర్స్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, అన్యాక్రాంతమయిన 90 ఎకరాల భూమిని పరిరక్షించి వర్సిటీ ఆస్తులను కాపాడడం, అపరిష్కృతంగా ఉన్న 21 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో క్రమబద్ధీకరించడం, ఇదే తరహాలో మరో 8 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం, పరీక్షల నూతన భవనం, క్యాంపస్ లోపల డబుల్‌లైన్ రోడ్ల నిర్మాణం, సరస్వతి హాస్టల్ నిర్మాణం తదితర పనులు సమర్థవంతంగా పూర్తి చేశారు. ప్రొఫెసర్లు క్రమం తప్పకుండా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. వర్సిటీ పాలనను గాడిలో పెట్టడం, వర్సిటీ ప్రగతిని గమనించిన రాష్ట్ర గవర్నర్ ఇటీవల జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రశంసల వర్షం కురిపించారు. అయితే బోధనేతర ఉద్యోగులను సస్పెండ్ చేసిన వ్యవహారంలో వీసీ మాచిరెడ్డిపై పలువురు ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు.

నాలుగు దుకాణాల్లో చోరీ


మస్తాన్ దుకాణంలో చొరబడిన ఓ దొంగ (సీసీ ఫుటేజీ)

గుంతకల్లు రూరల్: స్థానిక కసాపురం రోడ్డులోని నాలుగు దుకాణాల్లో ఆగంతకులు చొరబడి నగదు, విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు...

బుధవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ ఫాస్ట్ ఫుడ్‌సెంటర్ తాళాలు బద్ధలుగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు రూ.3 వేల నగదు, గ్యాస్ సిలెండర్, రూ. 3 వేలు విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న మరో రెండు దుకాణాల్లోనూ ప్రవేశించి ఓ షాపులో గ్యాస్ సిలెండర్, మరో షాపు నుంచి వట్టి చేతులతో వెనుతిరిగారు. అక్కడ నుండి కొద్ది దూరం వెళ్లి స్థానికుడు మస్తాన్ నిర్వహిస్తున్న దుకాణంలో చొరబడ్డారు. రూ.వెయ్యి, కొంత చిల్లర తీసుకుని వెళుతూ సీసీ కెమెరా కనిపించడంతో దానిని కూడా తీసుకెళ్లారు. ఉదయమే దుకాణానికి చేరుకున్న మస్తాన్ చోరీ విషయాన్ని గుర్తించి, సీసీ ఫుటేజీల కోసం కెమెరా వద్దకెళ్లాడు. కెమెరా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం చోరీ జరిగిన మిగిలిన మూడు దుకాణాల్లోనూ పరిశీలిస్తూ దుండగుల ఆనవాళ్ల కోసం చుట్టుపక్కల వెదుకుతూ ముందుకు సాగారు. టీటీడీ కల్యాణమంటపం సమీపంలో ధ్వంసం చేసిన సీసీ కెమెరా లభ్యమైంది. అందులోని పుటేజీలు మాత్రమే భద్రంగా ఉండడంతో మస్తాన్‌తో కలసి వాటిని పోలీసులు పరిశీలించారు. ఇద్దరు యువకులు దుకాణంలో ప్రవేశించినట్లుగా అందులో స్పష్టంగా ఉంది. ఘటనపై కసాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం టవర్‌క్లాక్: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన భవిష్య, యశస్విని బంగారు పతకం సాధించి వీరు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్‌లో గుజ్జల యోగచర్విత బంగారు పతకం సాధించి డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య గురువారం అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు శ్రీకాంత్, రామాంజి, తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో రజత పతకాలు సాధించిన జి.షామిలి, ఎస్ఎం అఫ్రీన్, ఫర్హాత్ పాల్గొన్నారు.

జనవాక్కు

జగనన్న సురక్షతో లబ్ధి చేకూరింది



మాది ఉమ్మడి కుటుంబం. ఓ ఎకరా పొలం ఉంది. బీఈడీ పూర్తి చేశాను. ప్రైవేట్ ఉద్యోగంతో పాటు వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న సర్కార్ ఏర్పాటైన తర్వాత ఉమ్మడి కుటుంబం రికార్డుల నుంచి నా కుటుంబాన్ని వేరు చేశారు. దీంతో నాకు రైతు భరోసా పథకం వర్తించింది. పెట్టుబడి సాయం కింద రూ.13,500 చేతికి అందాయి. ఈ డబ్బుతో పెట్టుబడి లేని వ్యవసాయం చేస్తూ సంతోషంగా జీవిస్తున్నాం. సీఎం జగన్‌కు నా కుటుంబం రుణపడి ఉంటుంది.

– నక్కా కళానాథ్, దేవరపల్లి, పామిడి మండలం

వితంతు పింఛన్ వస్తోంది



నా భర్త కొండన్న 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. వ్యవసాయం చేస్తూ నా ముగ్గురు పిల్లలను పెంచి పెద్ద చేశాను. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నా కొడుకు కొండన్నతో పాటు కోడలు రెడ్డమ్మ సచివాలయ ఉద్యోగస్తులయ్యారు. దీంతో అప్పటి వరకూ నాకొస్తున్న వితంతు పింఛన్ ఆగిపోయింది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రేషన్ కార్డు నుంచి నన్ను వేరు చేసి, పింఛన్‌కు అర్హత దక్కేలా చేశారు. మూడు నెలలుగా నాకు వితంతు పింఛన్ వస్తోంది. సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేను.

– పి.శకుంతలమ్మ, దేవరపల్లి

వచ్చే నెలలో గృహ ప్రవేశం



నా భర్త సప్లయర్స్ సామగ్రిని అద్దెకిస్తుంటాడు. అద్దె ఇంట్లో ఉంటూ నానా ఇబ్బందులు పడ్డాం. మార్కెట్ ధరతో స్థలం కొని, ఇల్లు కట్టుకోవడం మా లాంటి సామాన్యులకు సాధ్యం కాదు. దీంతో సొంతిల్లు కలగానే మిగిలిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నాకు వార్డు వలంటీర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. అంతేకాక అర్హతే ప్రామాణికంగా మాకు దోనిముక్కలరోడ్డులోని జగనన్న లేఔట్-3లో నివేశన స్థలాన్ని జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాం. ఇప్పటి వరకూ రూ.1.80 లక్షల బిల్లులు జమ అయ్యాయి. వచ్చే నెల గృహ ప్రవేశం చేయాలనుకుంటున్నాం. సొంతింటి కలను సాకారం చేసిన జగనన్నకు కృతజ్ఞతగా ఉంటాం.

– ఈ.సుప్రియ, రాజేంద్రనగర్, గుంతకల్లు

సంక్షేమ పథకాలు దక్కాయి



నా భర్త కొన్నేళ్ల క్రితమే మరణించాడు. ఇద్దరు కుమారులున్నారు. సంచార జాతులకు చెందిన వాళ్లం కావడంతో కుల ధ్రువీకరణ పత్రం లేక దశాబ్దాలుగా సంక్షేమ పథకాలకు నోచుకోలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నయాపైసా ఖర్చు లేకుండా మాకు ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలను వలంటీర్ తీసుకొచ్చి ఇచ్చారు. దీంతో నాకు వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి చేకూరింది. డిగ్రీ చదువుతున్న నా కుమారుడు జగనన్న విద్యాదీవెన పథకానికి అర్హత సాధించాడు. మాలాంటి పేదలకు మంచి చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాము.

– వై.ఎర్రమ్మ, 14వ వార్డు, గుంతకల్లు

విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రీ వేణుమాధవ్

అనంతపురం రూరల్: రాష్ట్రంలో 18 లక్షల కుటుంబాలున్న విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్‌చార్జ్ కర్రీ వేణుమాధవ్, విశ్వబ్రాహ్మణ, పంచ వృత్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ బాబు కోరారు. గురువారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులను ఇప్పటి వరకూ కేవలం ఓటు బ్యాంకుగానే అన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జనాభా ప్రకారం నాలుగు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని, విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ త్వరలో శంఖారావ సభ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం

పామిడి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం పాళ్యం తండా నివాసి ఆర్.లక్ష్మణనాయక్ కుమారుడు రాముడు నాయక్ (47), లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. ఇటీవల విక్రయించిన వేరుశనగ పంటకు సంబంధించి డబ్బు వసూలు చేసుకునేందుకు బుధవారం సాయంత్రం గార్లదిన్నె మండలం కల్లూరుకు వెళ్లాడు. డబ్బు వసూలు చేసుకుని గురువారం వేకువజామున తన టీవీఎస్ మోపెడ్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. 44వ జాతీయ రహదారిపై పామిడి వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మంటల్లో కాలిపోయిన బొలెరో

కూడేరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో బొలెరో వాహనం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన మేరకు... కూడేరు మండలం శివరాంపేటకు చెందిన బోయ రాజేంద్ర, మరో ఆరుగురితో కలసి వజ్రకరూరు మండలం కడమలకుంటలోని సుంకులమ్మ ఆలయానికి బొలెరో వాహనంలో వెళ్లారు. అక్కడ అమ్మవారి దర్శనం చేసుకుని, మొక్కులు చెల్లించిన అనంతరం గురువారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్నారు. వాహనాన్ని ఇంటి వద్ద నిలుపుతున్న సమయంలో ఒక్కసారిగా లోపల మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన రాజేంద్ర, కుటుంబ సభ్యులు వాహనంలో నుంచి వెంటనే కిందకు దిగారు. మంటలు ఆర్పేలోపు వాహనం లోపలి భాగం పూర్తిగా కాలిపోయింది.

పెళ్లిలో అతిథులకు మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న వధూవరులు

రాయదుర్గం టౌన్: 'మమ్మల్ని ఆశీర్వదించండి... మీరూ ఆదర్శంగా నిలవండి' అంటూ పెళ్లి వచ్చిన అతిథులకు, బంధువులకు ఓ నూతన జంట మొక్కలను అందించింది. వివరాలు.. రాయదుర్గానికి చెందిన శివకుమార్‌కు, కళ్యాణదుర్గానికి చెందిన మౌనికతో రాయదుర్గంలోని ఓ కల్యాణ మంటపంలో గురువారం వివాహం జరిగింది. పర్యావరణ పై స్పృహ కలిగిన నవ దంపతులు వేడుకకు హాజరైన వారికి దాదాపు 200లకు పైగా మొక్కలను అందజేశారు. ఇళ్ల వద్ద, పొలాల్లో, గ్రామ పరిసరాల్లో వాటిని నాటి సంరక్షించాలని, అదే మీరు మా కిచ్చే అద్భుతమైన వివాహ బహుమతి అని కోరారు.

సైబర్ ఉచ్చులో యువకుడు

బొమ్మనహాళ్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న ఓ యువకుడు తన బ్యాంక్ ఖాతాలోని నగదును పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం చంద్రగిరికి చెందిన గోపికి వారం రోజుల క్రితం అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. బ్యాంక్ లోన్‌కు అర్హత ఉందని, మొత్తం ఆన్‌లైన్ ద్వారానే ప్రక్రియ ముగిస్తే నేరుగా బ్యాంక్ ఖాతాలోకి నగదు జమ అవుతుందని నమ్మించారు. అజ్ఞాత వ్యక్తి మాయలో చిక్కుకున్న గోపి... ఆ తర్వాత అవతలి వ్యక్తి అడిగిన వాటికి సమాధానమిచ్చాడు. మరుసటి రోజు గోపికి కర్ణాటక బ్యాంక్‌లో ఉన్న ఖాతా నుంచి రూ.1.80 లక్షలు విత్‌డ్రా అయినట్లు మొబైల్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన వెంటనే బ్యాంక్‌కు వెళ్లి అధికారులను సంప్రదించడంతో సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారణ అయింది. ఇదే విషయాన్ని అనంతపురంలోని తన స్నేహితుడికి వివరించడంతో ఆయన సూచన మేరకు అదే రోజు జిల్లా కేంద్రానికి వెళ్లి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్

అనంతపురం క్రైం: బాలికను నిర్బంధించి బలవంతంగా పని చేయించుకోవడమే కాక కొట్టి, హింసించిన కేసులో ఉరవకొండలోని జేఎఫ్‌సీఎం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) వసంత లక్ష్మిని అనంతపురం మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అజ్ఞాతంలో ఉన్న ఆమె భర్త కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక నిర్బంధం, బలవంతంగా మైనర్లతో పనిచేయించుకోవడం, హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద వసంతలక్ష్మి, ఆమె భర్త రమేష్, మరో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి 9.30 గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వసంతలక్ష్మి అరెస్ట్ వివరాలను అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి వెల్లడించారు. ఏపీపీ వసంతలక్ష్మి ఇంట్లో 16 సంవత్సరాల బాలిక పనిచేసేది. శరీరంపై కందిన గాయాలతో ఆస్పత్రి పాలైన బాలిక అంశం ఈ నెల 17న వెలుగు చూసింది. సర్వజనాస్పత్రి వైద్యులు అందజేసిన మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ) సమాచారంతో అనంతపురం మూడో పట్టణ సీఐ ధరణికిషోర్, మహిళా పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై బాలికతో ఆరా తీసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్న బాలిక తన తల్లిని తప్ప ఇతరులెవ్వరినీ దగ్గరకు రానివ్వకపోవడంతో చివరకు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

చదువుకుంటానంటే హత్యాయత్నం చేశారు

ఏపీపీ వసంతలక్ష్మి తన ఇంట్లో పనిచేసేందుకు ఏర్పాటు చేసుకున్న బాలిక చదువు పట్ల అత్యంత ఆసక్తి కనబరిచింది. ఈ క్రమంలోనే తాను చదువుకునేందుకు వెళతానని చెప్పడంతో ఏపీపీతో పాటు ఆమె భర్త రమేష్, మరో వ్యక్తి బలవంతంగా ఇంట్లోనే నిర్బంధించారు. దీంతో బాలిక ఏడుస్తుంటే ప్రాణాపాయ స్థితికి చేరుకునేలా చితక్కొట్టారు. దెబ్బలకు తాళలేక శరీరం మొత్తం కందిపోయింది. అతికష్టంపై వారి చెర నుంచి తప్పించుకున్న బాలిక తన తల్లిని చేరుకుని జరిగిన దురాగతాన్ని వివరించింది.

ఎవరినీ ఉపేక్షించం

బాలిక తన తల్లితో చెప్పిన ప్రతి అంశాన్ని ఆమె పోలీసులకు వాంగ్మూలం ఇచ్చిందని డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. బాలిక విషయంలో ఇబ్బంది పెట్టిన వారందరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. బాలిక కోలుకుంటే తనపై దాడి చేసిన వారు ఎవరో తెలిసే అవకాశం ఉందన్నారు. ఈ కేసులో బాధ్యులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా వారిని వదలబోమన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఈ అంశంలో రాజీపడబోమని స్పష్టం చేశారు.

మిర్చి పంట ఎత్తుకెళ్లారు

- పొలం నుంచే అపహరించుకెళ్లిన వైనం
- గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులపై అనుమానం


ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు దంపతులు పుష్పవతి, నారాయణ

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురంలో రైతులు శ్రమించి పండించిన మిర్చి పంటను దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధిత రైతు దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు... గ్రామానికి చెందిన మహిళా రైతు పుష్పవతి తనకున్న మూడు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేసింది. ఇందు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.6 లక్షలు అప్పు చేసింది. దాదాపు మూడు క్వింటాళ్ల వరకూ పంట దిగుబడి వచ్చింది. ఈ క్రమంలో పంట తొలగించి, మార్కెట్‌కు తరలించేందుకు రైతు దంపతులు సిద్ధమయ్యారు. పంట ఏపుగా పెరిగిన విషయం తెలుసుకున్న దుండగులు రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రి మొత్తం మిర్చి దిగుబడిని తొలగించి వాహనంలోకి లోడ్ చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న రైతు దంపతులు దుండగులను వెంబడించినా ఫలితం లేకపోయింది. పంటతో సహా దుండగులు ఉడాయించారు. ఘటనపై సీఐ తిమ్మయ్యకు గురువారం రైతు దంపతులు పుష్పవతి, నారాయణ ఫిర్యాదు చేశారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులే పంటను దొంగలించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

క్లుప్తంగా

నిజరూపపాద స్పర్శ దర్శనం



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

అనంతపురం కల్చరల్: స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నిజరూప పాదదర్శన పూజలు గురువారం నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చిన తొలి ఏకాదశి సందర్భంగా జరిగిన పాదదర్శన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయంలో అర్చనలు, పుష్పాలంకార సేవలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతిరావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్, నగేష్ పాల్గొన్నారు.

ఓటీపీఆర్ఐలో లిఫ్ట్ ప్రారంభం



లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఓటీపీఆర్ఐలో నూతనంగా నిర్మించిన మూడో అంతస్తు కళాశాల భవనంలో సిబ్బంది, విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన గురువారం ప్రారంభించారు. ఓటీపీఆర్ఐ పురోగతికి అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే విద్యార్థులకు హాస్టళ్లు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాదృక్పథం అభినందనీయం



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: హెచ్ఐవీతో జీవిస్తున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించే సేవాదృక్పథం అభినందనీయమని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఐఎంఏ హాల్‌లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్, చైతన్య కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో 50 మంది చిన్నారులకు సౌత్ ఇండియా చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ట్రస్టు ఆర్థిక సహాయంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులందరూ బాగా చదువుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ చిన్నారులందరూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. సౌత్ ఇండియా చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ట్రస్టు డైరెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ అధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ జీవీ రమణ, చైతన్య కళాభారతి డైరెక్టర్లు విజయభాస్కర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆదివాసీలకు కేంద్రం అన్యాయం



సభలో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక నాయకులు

అనంతపురం అర్బన్: ఆదివాసీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ భూములను కార్పొరేట్‌కు కట్టబెట్టేందుకు అటవీ చట్టాన్ని సవరించిందన్నారు. గురువారం స్థానిక తరిమెల నాగిరెడ్డి భవన్‌లో ఆదివాసీ సదస్సు సావనీర్-2023 ఆవిష్కరణ సభ నిర్వహించారు. మానవ హక్కుల వేదిక నాయకుడు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న మాట్లాడారు.

భూసార పరీక్షలపై శిక్షణ

పెద్దపప్పూరు: స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆత్మ–డీఆర్‌సీ అనంతపురం వారి ఆధ్వర్యంలో భూసార పరీక్షా ఫలితాలపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ మద్దిలేటి మాట్లాడారు. భూసార పరీక్షా విధానం, వాటి ప్రయోజనాలను వివరించారు. రసాయన ఎరువులు అధికంగా వాడటంతో భూమిలో సారం తగ్గిపోతుందన్నారు.

వైఎస్సార్‌సీపీకి మరోమారు పట్టం కట్టాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



28వ సచివాలయ పరిధిలోని రహమత్‌నగర్‌లో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్'లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: దేశంలో ఏముఖ్యమంత్రి చేయని విధంగా నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని, రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కోరారు. గురువారం నగరంలోని 18,28,29,30 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ కార్యక్రమం జరిగింది. 16వ డివిజన్‌లోని 28వ సచివాలయ పరిధిలోని రహమత్‌నగర్‌లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే, ఈ సచివాలయ పరిధిలో రోడ్లు, డ్రైన్లు, తదితర అభివృద్ధి పనులకు రూ.2.5 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కోర్టు రోడ్డులోనే రూ.కోటికిపైగా వెచ్చించి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామన్న చంద్రబాబు మాటతప్పి మహిళలకు మోసం చేశారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటి వరకు మూడు దశల్లో రూ.19వేల కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేశారన్నారు.

దుష్ప్రచారం చేయడం తగదు..

ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై రాష్ట్రం అప్పులపాలవుతోందని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే అన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు.. ఆయన హయాంలో ఈ స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, రమణారెడ్డి, జగదీష్, జేసీఎస్ కన్వీనర్లు వీరా రామకృష్ణారెడ్డి, చింతకుంట మధు, లక్ష్మన్న, రామాంజనమ్మ, కార్పొరేటర్లు హసీన, మల్లెమీద నరసింహులు, బాలాంజనేయులు, ఇషాక్, కోఆప్షన్ సభ్యురాలు మార్తా, ఎంఎల్‌ఓ అమర్నాథ్ రెడ్డి, పార్టీ నాయకులు బలరాం, షుకూర్, జానీ, జాఫర్, వలి, మున్నా పాల్గొన్నారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి

అనంతపురం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అనంతపురం నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలను అభివృద్ధి చెందినట్లు జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజీవ్‌కాలనీ పంచాయతీ సచివాలయం 2 పరిధిలో 'జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆశాబీ, రూరల్ క్లస్టర్ కన్వీనర్ హుస్సేన్ తదితరులు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనరసమ్మ, దౌలా, రహీమ్, రంగయ్య, పసులూరు ఓబులేసు, అంజి, హాజరాబి లీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వెంటనే రోడ్ల నిర్మించారు..

అనంతపురం కార్పొరేషన్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి విన్నవించిన వెంటనే రూ.25 లక్షలతో రోడ్డు నిర్మించారని గుల్జార్ పేట ప్రజలు చెప్పారు. గురువారం 18వ డివిజన్ 25వా సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతా సోమశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను వివరించారు. ఈ సందర్భంగా చింతా సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యుల ప్రమేయంతో తూతూ మంత్రంగా పథకాలు మంజూరు చేసే వారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముంతాజ్ బేగం, నాయకులు అబ్దుల్ గఫార్, ఎంఎల్‌ఓలు దామోదరరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండోదశ 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ సచివాలయల పరిధిలో గురువారం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి సంబంధించి రెండో దశ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన వివరాలు తెలియజేశారు. ఈ నెల 24న 4,40,50,12 , 28న 5, 41, 51, 15 , 29న 6, 42, 52, 19 సచివాలయాలు, 30న 26, 43, 53,23 సచివాలయాలు, డిసెంబర్ 1న 27,44,54, 24, 4న 31, 45, 55, 33, 5న 32, 46, 57, 17, 6న 34,47,58, 7న 35, 48,59, 8న 46,49, 11న37, 56,61, 12న 38, 62, 13న 63, 14న 67, 64, 15న 68, 65, 18న 66, 69, 19న 70,74, 20న 71, 22న 73, 26న 10 సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అంధుల ఆదర్శ వివాహం



అంధ వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: అంధుల వివాహం ఆదర్శనీయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని జగదీశ్వరాలయంలో శ్రీసత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకొని ఇద్దరు అనాథ అంధుల వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. ఎమ్మెల్యే వధూవరులను ఆశీర్వదించారు. చిన్మయ మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, విజిలెన్సు ఎస్పీ మునిరామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంథోని రెడ్డి సతీమణి శ్రీలతరెడ్డి, నెహ్రూ యువకేంద్ర డీడీవో శ్రీనివాసులు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థలో తహసీల్దార్ బాలకిషన్, అదనపు కమిషనర్ రమణారెడ్డితో కలిసి బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లతో ఆ ప్రక్రియపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివిధ బూత్‌ల వారీగా ఓటరు నమోదు, సవరణలపై కమిషనర్ మాట్లాడారు. ఫాం 6 కొత్త ఓటరు నమోదుకు సంబంధించి 3,436 మంది దరఖాస్తు చేసుకుంటే 3,031 నమోదు చేశారన్నారు. ఫాం 7 ఓటరు నమోదుకు సంబంధించి 3,940 దరఖాస్తులు వస్తే 3,300 నమోదు చేశారన్నారు. ఫాం 8 ఓటరు సవరణకు సంబంధించి 4,685 దరఖాస్తుల్లో 4,162 సవరణ చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని మరింత వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఒకే వ్యక్తి ఫొటోతో వివిధ ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్న ట్‌లెతై వారి ఇళ్లకు ఏఈఆర్‌ఓ సంతకం ద్వారా రిజిష్టర్ పోస్టు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటా చెత్త సేకరణ జరగాలి: ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం కన్పించకూడదన్నారు. క్లాప్ ఆటో కలెక్షన్లను వేగవంతం చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్సు వసూళ్లలో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఈఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వస్తువులు కొనుగోలు చేస్తే రశీదు తప్పనిసరి



మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు మోహన్

అనంతపురం ఎడ్యుకేషన్: మార్కెట్‌లో కల్తీ, నకిలీ వస్తువుల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, వస్తువులు కొనుగోలు చేస్తే తప్పక రశీదు పొందాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు వై.మోహన్ తెలిపారు. గురువారం స్థానిక రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో వినియోగదారుల హక్కులపై అవగాహనలో భాగంగా విద్యార్థులకు సదస్సు ఏర్పాటు చేశారు. పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు సమయంలో తప్పక రసీదు తీసుకోవాలన్నారు. తద్వారా వస్తువుల్లో ఏదైనా లోపం ఉన్నట్లు గుర్తిస్తే కొత్త వస్తువును పొందే వీలు ఉంటుందన్నారు. ఒకవేళ వ్యాపారి కొత్త వస్తువు ఇవ్వకపోతే వినియోగదారుడు కోర్టుకు వెళ్లి తగిన పరిహారంతో పాటు కోర్టు ఖర్చులు, మానసిక వేదనకు తగిన పరిహారం కూడా పొందొచ్చన్నారు. సంస్థ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ వస్తువులు తయారీ, గడువు తేదీ ప్యాకింగ్ ఏవిధంగా ఉండాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గంగేనాయక్, సంస్థ జిల్లా ఉప కార్యదర్శి శంకరయ్య, లీగల్ అడ్వైజర్ యోజనమూర్తి పాల్గొన్నారు.

జగనన్న చేసిన మంచిని తెలియజేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: టీడీపీ హయాంలో పచ్చ కండువా కప్పుకుంటేనే పథకాలు అందేవి.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పార్టీలకతీతంగా పథకాలు అందాయని ఎంపీపీ హేమలత, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును తెలియజేద్దామని పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు సచివాలయం-1 లో గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి జరిగే కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 24 నుంచి మండలంలో ' వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. 21న ఆత్మకూరు సచివాలయం-1లో, 28న ఆత్మకూరు సచివాలయం -2లో, 29న బి. యాలేరులో, 30న మదిగుబ్బలో, 1న ముట్టాల, 4న పి.యాలేరు, 5న పంపనూరు, 6న సనప, 7న తలుపూరు, 8న తోపుదుర్తి, 11న వేపచెర్ల గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరులో జరగబోవు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి మండలంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఎలక్షన్ ఇన్‌చార్జ్ సనప గోపాల్‌రెడ్డి, కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉపసర్పంచ్ తైదుల శివారెడ్డి ,వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద కొండారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజు, ఫణిరెడ్డి, సుదాకర్‌రెడ్డి, అతిక్‌రెడ్డి, ఎర్రిస్వామి,లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి, పోతన్న, ఎర్రిస్వామి, ఆంజనేయులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శతక పద్యాలు... వెలుగు మూటలు



మాట్లాడుతున్న జానపద కళాకారుడు సాధుశేఖర్

అనంతపురం కల్చరల్: తెలుగు సాహిత్య ప్రక్రియలలో సామాన్య ప్రజలు కూడా చదివి అర్థం చేసుకునేందుకు వీలుగా ఉన్న శతక పద్యాలు మానవ జీవితాలకు వెలుగు మూటలని వ్యక్తలు అన్నారు. జిల్లా పర్యాటక, పురావస్తు, ఇంటాక్ సంయుక్తంగా నిర్వహిస్తోన్న ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శతక పద్య పఠన పోటీలు జరిగాయి. ఒంటెద్దు రామలింగారెడ్డి, కంబదూరు షేక్ నబీరసూల్, ఆశావాది సుధామవంశి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వందలాది యువతీయువకులు హాజరై శతక పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర భారతి అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, సీనియర్ జానపద గాయకుడు సాధుశేఖర్, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ తదితరులు మాట్లాడారు. పద్య రచన ద్వారా ప్రాచీన, మధ్యయుగ కవులు సమాజాన్ని మార్చిన వైనాన్ని వివరించారు. డాక్టర్ అంకె శ్రీనివాసులు, మదన మోహన్ సమన్వయకర్తలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఇంటాక్ ప్రతినిధులు పిడతల కృష్ణమూర్తి,, నాగభూషణం, రియాజుద్దీన్, విశ్రాంత ప్రిన్సిపాల్ గిరిధరరాయ్ పాల్గొన్నారు.

ముగిసిన వర్సిటీ అంతర కళాశాలల గ్రూప్ సీ పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల గ్రూప్ – సీ పోటీలు గురువారం ముగిశాయి.

- చెస్ విన్నర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, అనంతపురం, రన్నరప్ ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల.
- హాకీ విన్నర్ గవర్నమెంట్ కళాశాల, ధర్మవరం, రన్నరప్ గవర్నమెంట్ కళాశాల, అనంతపురం.
- వాలీబాల్ విన్నర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, బుక్కపట్నం. రన్నర్ మంగళకర డిగ్రీ కళాశాల, జగరాజుపల్లి.
- ఖోఖో విన్నర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఉరవకొండ, రన్నర్ నారాయణ ఫిజికల్ ఎడ్యుకేషన్, తాడిపత్రి
- బహుమతుల ప్రదానోత్సవం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశావాది శశాంక మౌళి, ఫిజికల్ డైరెక్టర్లు జేబీ ఉల్లా, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) వరప్రసాద రావు గురువారం గార్లదిన్నె, పామిడి మండలాల్లోని భవితా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిసౌకర్యాలు, బోధన విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పామిడి మండలం చైతన్య కాలనీ, హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలకు వెళ్లారు. 'మనబడి నాడు-నేడు' పనులను పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అత్యాధునికంగా తీర్చిదిద్దుతోందన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయించాలన్నారు. ఖర్చు చేసిన నగదుకు ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కేజీబీవీలో విద్యార్థినుల నోట్‌బుక్స్‌ను టీచర్లు కరెక్షన్స్ చేశారా లేదా? అని పరిశీలించారు. కిచెన్, స్టోర్ రూం లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాలికకు అండగా ఉంటాం



మేయర్ వసీంతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం

అనంతపురం మెడికల్: ఏపీపీ కుటుంబ దాడిలో గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్టేట్ మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం భరోసా కల్పించారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో బాధిత బాలికను ఆమె పరామర్శించారు. బాలికపై దాడి ఘటన గురించి ఆమె తల్లి, కుటుంబ సభ్యులతో ఆరాతీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మేయర్ వసీంను ఆయన క్యాంపు కార్యాలయంలో షేక్ రుకియా బేగం మర్యాదపూర్వకంగా కలిశారు. బాలికకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో ఉంటూ బాలికపై దాడి చేయడానికి ఆమెకు ఎలా మనసు వచ్చిందో అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేసే వరకూ పోరాడుతామని తెలిపారు. వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కనగానపల్లి (రాప్తాడు): రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌కు చెందిన ఆదిలక్ష్మి బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెన్నపూస లోకేశ్వరరెడ్డి మృతురాలికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేలు అందించారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో హెచ్ఐవీ నియంత్రణపై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, సంస్థ నరేష్‌బాబు, విజయభాస్కర్ మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి హెచ్ఐవీ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

కనగానపల్లి(రాప్తాడు): రాప్తాడు మండలం హంపాపురం సమీపంలో మౌనగిరి క్షేత్రంలో రాష్ట్రస్థాయి భజన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా నుంచే గాక కర్నూలు, కడప, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భజన బృందాలు వచ్చాయి. ఈ పోటీలన్నీ శ్రీరామ, ఆంజనేయస్వామి కీర్తనలతో చాలా భక్తిశ్రద్ధలతో జరిగాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఆలయ కమిటీ చైర్మన్ ఈశ్వరయ్య స్వామి ప్రత్యేకంగా సన్మానించి, బహుమతులు అందించారు.

రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం సిటీ: రైల్వే వ్యవస్థ ప్రైవేటీకరించాలన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం అనంతపురంలోని రైల్వే స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ.. సరుకు రవాణాతో పాటు సాధారణ, మధ్య తరగతి వర్గాల ప్రయాణికులకు అనుకూలంగా ఉన్న రైల్వే వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నాడని మండిపడ్డారు. రైల్వే ఆస్తులన్నింటినీ అదానీ, అంబానీలకు నామమాత్రపు లీజుతో కట్టబెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ సిద్ధమైందన్నారు. రైల్వే ప్రైవేటీకరణ జరిగితే లాభాలు వచ్చే రూట్లు తప్ప ఆదాయం లేని మార్గాలు మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైలింజన్లు, వ్యాగన్లు, బోగీలు, చక్రాల తయారీ తదితర కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మొత్తం ఏడు పరిశ్రమలను ప్రైవేటుకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేభారత్ రైళ్ల మనుగడ కోసం వందలాది ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసి, ఇప్పటికీ పునరుద్ధరించడం లేదన్నారు. రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొట్టేందుకు ఉద్యమాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం



ఎస్కేయూ వీసీ రామకృష్ణా రెడ్డిని సన్మానిస్తున్న బోధనేతర ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని యోగివేమన వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జే. కృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూ వీసీ పదవీ కాలం శుక్రవారం పూర్తి కానున్న నేపథ్యంలో బోధనేతర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ సమయపాలన, విధుల పట్ల నిబద్ధత, పాలనాదక్షుడు అని కొనియాడారు. కార్యక్రమంలో బోధనేతర సంఘం అధ్యక్షుడు పి. ఆదినారాయణ రెడ్డి, బోధనేతర సంఘం కార్యదర్శి/సభాధ్యక్షుడు చిత్రా శాంతలింగం, సాకే గోవిందు, హాస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మారెప్ప, సెక్రటరీ సి. గోవర్ధన్ , టైం స్కేల్, మినిమం స్కేలు ఉద్యోగులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణలో ఆదర్శం

పుట్లూరు: అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన పుట్లూరు ఆదర్శ పాఠశాలకు జిల్లా ఉత్తమ అటల్ టింకరింగ్ ల్యాబ్ మెమొంటో లభించింది. గురువారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అటల్ టింకరింగ్ ల్యాబ్ నోడల్ టీచర్స్ కాన్ఫరెన్స్‌లో నోడల్ టీచర్ అరుణ్ జిల్లా అధికారులతో కలిసి మెమొంటో అందుకున్నారు.